క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష శిబిరం

చాట్రాయి: మర్లపాలెంలోని సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మినీ జాబ్‌మేళాలో 43మంది ఎంపిక



నూజివీడు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో పలు ఉద్యోగాలకు 43 మందిని ఎంపిక చేసినట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. స్థానిక శ్రీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు మొత్తం 126మంది అభ్యర్థులు హాజరయ్యారని, 43మంది వివిధ కొలువులకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తోటకూర సాంబశివరావు, ప్రిన్సిపాల్ ఇద్రీస్, జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంటుకు సన్మానం



చింతలపాడు(తిరువూరురూరల్): రెండు సంవత్సరాలకు పైగా తమ గ్రామంలో సేవలందించి విజయవాడకు బదిలీపై వెళ్లిన మండలంలోని చింతలపాడు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంటు ఎండీ అఫ్రీన్ బేగంకు ఆ గ్రామస్తులు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. విద్యార్థినులు శాలువాలతో ఆమెను సత్కరించారు. ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయుడు పీవీ రావు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి వైద్యులకు అవార్డులు



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వైద్యులకు కుటుంబ నియంత్రణలో భాగంగా జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నుంచి రూ.7వేల నగదు బహుమతి, పురస్కారాన్ని అందుకున్నారు. ద్వితీయ స్థానానికి ఎంపికైన నూజివీడు ఏరియా ఆస్పత్రికి చెందిన గైనకాలజిస్టు కే అనూష రూ.5వేల నగదు బహుమతి, పురస్కారం అందుకున్నారు. బంగినపల్లితోటలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆశావర్కర్ పీ కమల ఉత్తమ ఆశా వర్కర్‌గా ఎంపికై రూ.2,500 బహుమతి, పురస్కారం అందుకున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఏ.కొండూరు: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఎంఈఓ ఎం.రాజశేఖర్ అన్నారు. మండలంలో కంభంపాడు హోలీక్రాస్ పాఠశాలలో మంగళవారం యు డైస్ అనే అంశంపై హెచ్‌ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ యు డైస్ సైట్‌లో పాఠశాలలకు సంబంధించిన అంశాలను నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం నిరసన దీక్ష

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతుల సామూహిక నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఒక్క రైతు కౌలు రైతుకు వ్యవసాయ అవసరాల కోసం ఎకరానికి రూ.పదివేల సాయం అందించాలని కోరారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి నాగులమీరా, రైతు సంఘం తిరువూరు నియోజకవర్గం అధ్యక్షుడు సాంబశివరావు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసన జ్వాలలు

గంపలగూడెం: పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేస్తూ మండలంలోని వలంటీర్ల ఆధ్వర్యంలో గంపలగూడెంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి తోటమూల వై-జంక్షన్ వరకు వలంటీర్లు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లపై పవన్‌కల్యాణ్ నిరాధార ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఆయన తన వ్యాఖ్యలను భేషరతుగా విరమించుకోవాలని, వలంటీర్లకు క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని గంపలగూడెం ఎస్సై రాంబాబుకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు కృష్ణారెడ్డి, సువారపు చంద్రశేఖర్, బండి అచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

మైలవరం: వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా అభివర్ణిస్తూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వలంటీర్లకు పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'పవన్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మైలవరం మండలంలోని వలంటీర్లు స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో మానవ హారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు.

మూడు గంటల సినిమా కాదు..

జి.కొండూరు: రాజకీయమంటే సినిమాలో డైలాగులు చెప్పినట్లు కాదని, గ్రామ వలంటీర్ల మీద జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కితీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిసనగా జి.కొండూరులో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి నిరసన ర్యాలీని మంగళవారం నిర్వహించారు.



గంపలగూడెంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వలంటీర్లు



మైలవరంలో మానవహారం ఏర్పాటు చేసిన వలంటీర్లు



జి.కొండూరులో నిరసన తెలుపుతున్న గ్రామ వలంటీర్లు

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నూజివీడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల వారీగా నిర్వహించిన సమీక్షలో వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి మాట్లాడుతూ రైతు భరోసా కింద రూ.6.15 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ఎంఈవో-1 ఎం.సేవియా మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశామన్నారు. ఎంపీడీఓ వీఏ విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ స్వర్ణలత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

చంద్రాల(మైలవరం): విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు అని వైఎస్సార్ సీపీ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధర రావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో పని చేసి బదిలీపై వెళ్లిన వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను చంద్రాల ఎంపీపీ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం సన్మానించారు. సర్పంచ్ జే. జ్యోతి, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం వరదా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జనాభా పెరుగుదలతో ఆహార కొరత, నిరుద్యోగం

తిరువూరు: ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ అధిక జనాభాతో కలిగే సమస్యలను వివరించారు. జనాభా పెరుగుదలతో ఆహార కొరత, నిరుద్యోగం, ఆవాస సమస్యలు ఏర్పడతాయని పేర్కొన్నారు. అనంతరం జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.



తిరువూరులో జనాభా దినోత్సవ ప్రదర్శన

కుటుంబ నియంత్రణ పాటించాలి

ఏ.కొండూరు: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్ తేజ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ తేజ మాట్లాడుతూ తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై గ్రామాల్లోని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎం దయామని, సూపర్‌వైజర్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

తిరువూరురూరల్‌లో..

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరిపారు. మల్లేల, కాకర్ల, ఆంజనేయపురం గ్రామాల్లో చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. గ్రామ ఆరోగ్య కార్యదర్శులు విద్యార్థులకు, గర్భిణులకు, మహిళలకు ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



ఎ.కొండూరు ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి(నూజివీడు): దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ గ్రామాన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటికి సొంత భవనాలను సమకూరుస్తూ ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కనసానపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఇతర నాయకులు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మొద్దని, ఎన్నికలు సమీస్తుండటంతో టీడీపీ నాయకులకు ఇప్పుడు ప్రజలు గుర్తొచ్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎంపీపీ అనూష, సర్పంచ్ అమ్మిశెట్టి రమణ, ఎంపీడీఓ పీ శంకర్‌రావు, డీఎల్‌డీఓ వెంకటరత్నం, తహసీల్దార్ ఉదయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు హరిబాబు, సంజీవరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష లక్ష్యం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి(నూజివీడు): అపరిష్కృతంగా ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కనసానపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు 165 సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామస్తుల నుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తూనే ఇంకా అర్హత ఉండి పథకాలు రాని వారి సమస్యను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను గడపగడపకు పంపిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు పాల్గొన్నారు.

అర్హత ఉంటే చాలు పథకాల మంజూరు

చాట్రాయి: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ దుర్గా ప్రసాదు స్పష్టం చేశారు. మండలంలోని చీపురుగూడెం సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోందని చెప్పారు. అనంతరం 668 మందికి ఉచితంగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజినీ, తహసీల్దార్ విశ్వనాథ రావు, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, ఎంఈఓల బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

తిరువూరు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నిర్వహించారు. 72వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పతాకావిష్కరణ చేసి, కేక్ కట్ చేసిన నాయకులు కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్మిక సంక్షేమానికి తమయూనియన్ చేస్తున్న కృషిని డిపో, జోనల్, రీజనల్ నాయకులు రవిచంద్ర, ఎంవీకేరావు, స్వామి, సుందర రావు వివరించారు.

ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

జేసీ సంపత్‌కుమార్

మొర్సుమల్లి(మైలవరం): ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లిలో మంగళవారం సర్పంచ్ మాడపాటి రమాదేవి అధ్యక్షతన జగనన్న సురక్షా కార్యక్రమం జరిగింది. జేసీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ సంక్షేమ పథకాలు అందాలనేది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే ప్రజా సమస్యలు పరిష్కరించి, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అనంతరం 820 దరఖాస్తులను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం. శ్రీనివాస్, సర్పంచ్ రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, సుబ్బారావు, రామారావు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్, సత్యనారాయణరెడ్డి

సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ ఐదో డివిజన్ పద్మశాలీ బజార్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు ఆ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ తెలిపారు. ఈ రోడ్డును మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోవాలి

తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

మేడూరు/కనుమూరు(గంపలగూడెం): సచివాలయాల పరిధిలో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని తిరువూరు ఆర్డీఓ వైవీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గంపలగూడెం మండలం మేడూరులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యలను సైతం ఈ క్యాంపులో పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గ్రామంలో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 628 మందికి సర్టిఫికెట్ల పంపిణీని ఆమె ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, ఎంఈఓ నరసింహారావు, ఆర్‌ఐ వీరభద్రం, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

కనుమూరులో:

కనుమూరులో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో 621 సర్టిఫికేట్‌లను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.

రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

తిరువూరురూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. లక్ష్మీపురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గద్దల భారతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. గానుగపాడులో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు సురేష్ బాబు, మండల ప్రత్యేకాధికారి విజయభారతి, సర్పంచ్ కృష్ణవేణి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో వేగవంతంగా సంక్షేమం

ముసునూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మరింత వేగవంతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ కె.రాజానాయన తెలిపారు. మండలంలోని వలసపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం 1,071 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ దామోదర్, తహసీల్దార్ సుధ, ఎంపీడీఓ జి రాణి పాల్గొన్నారు.



మేడూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

'జగనన్న సురక్ష'లో నూరు శాతం సేవలు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో నూరుశాతం ప్రజలకు సేవలందించాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. మంగళవారం కె.తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమ సర్పంచ్ గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఎంపీ డీఓ శేషగిరిరావు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని కోడూరు సచివాలయంలో మంగళవారం జనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీపీ నాగలక్ష్మీ, సర్పంచ్ సురేష్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో అమలవుతోందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండల పరిధి మునగపాడు, కుంటముక్కల గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మునగపాడులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ అనురాధ పర్యవేక్షించగా, కుంటముక్కల గ్రామంలో తహసీల్దార్ రోహిణీదేవి పర్యవేక్షించారు.

సత్వర సేవలే ప్రభుత్వ లక్ష్యం

తిరువూరు: ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక నాలుగో వార్డు సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 7,9 వార్డులలో వచ్చిన అర్జీలను పరిశీలించి అక్కడికక్కడే ధ్రువీకరణపత్రాలను జారీచేశారు. గతంలో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు పొందడానికి నెలల తరబడి వేచివుండాల్సి వచ్చేదని, రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రారంభించిన తర్వాత అడిగిన వెంటనే సర్టిఫికెట్లు జారీచేస్తున్నారని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు ప్రసాద్, దుర్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెల్లదేవరపల్లిలో..

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి, నరసాపురం సచివాలయం-1 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తెల్లదేవరపల్లిలో 680, నరసాపురంలో 776 మందికి వివిధ సర్వీసులు అందించారు. సర్పంచ్ నాగరాణి, సొసైటీ అధ్యక్షుడు నాగాచారి, నరసాపురం సర్పంచ్ నాగమణి, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జూపూడిలో..

జూపూడి(ఇబ్రహీంపట్నం): జగనన్న సురక్ష వంటి విభిన్నమైన కార్యక్రమంతో ప్రతి ఇంటి సమస్య పరిష్కారమవుతుందని డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. జూపూడిలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్నతో కలిసి మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం 730 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ కాకి దేవమాత, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, డీటీ మహేష్, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు. దాములూరులో తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ మధుసూదనరావు అర్హులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఇబ్రహీంపట్నంలో పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, సచివాలయాల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు సర్టిఫికెట్లు అందజేశారు. కొండపల్లిలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

పొందుగలలో..

పొందుగల(మైలవరం): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమమని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తెలిపారు. మైలవరం మండలం పొందుగలలో మంగళవారం సర్పంచ్ కోటమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 1906 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: ప్రజల వినతులను పరిష్కరించడం కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చనపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుపతి రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చెన్నకేశవరావు, శ్రీరాంపురం సర్పంచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ పాల్ పాల్గొన్నారు.